క్లుప్తంగా

రేపు కులసంఘాల సమావేశం

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారంలోని ఆదివాసీ భవనంలో ఈనెల 31న బుధవారం ఆదివాసీ కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ భవనంలో మేడారం జాతరలో నిర్వహించే వ్యాపారాలపై ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, సభ్యులు తప్పకుండా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నాయకపోడు సేవా సంఘం నూతన కమిటీ



మంగపేట: మండల కేంద్రంలో ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కమిటీ బాధ్యులు కాపుల సమ్మయ్య ఆధ్వర్యంలో మండల నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షుడిగా చాద శేఖర్, ప్రధాన కార్యదర్శిగా లోటి వెంకటనారాయణ, ఉపాధ్యక్షుడిగా గోపా లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా పోలం తిరుపతి, కోశాధికారిగా పెద్దల నరేష్, కార్యవర్గ సభ్యులుగా గోపాల నరేష్, పిట్టల నాగేష్, సుంకరి రాము, పసుల అశోక్, గోరె నవీన్, భరత్, పిట్టల శ్రీను, చింత కుంట్ల విజయ్, గారే వెంకట్రామ్, సింగ రాము, వెంకటేష్, పుల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ బాధ్యులు పెద్ది సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత టీకాలు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో మంగళవారం జంతువులకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి శ్రీరాం నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంతు సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పశువైద్యశాలలో (పెంపుడు కుక్కలు) జంతువులకు ఉచితంగా టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పెంపుడు జంతువుల యాజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గణపురం: పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలని గణపురం తహసీల్దార్ మురళీధర్‌రావు తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1-11-2020 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఓటు హక్కుకు అర్హులని తెలిపారు. గతంలో ఓటరుగా నమోదు చేసుకున్న వారు తిరిగి మళ్లీ చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 6లోగా ఫామ్ 18 ద్వారా ఆన్‌లైన్ లేదా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరామర్శ

మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బానోత్ జగన్‌నాయక్ సోమవారం గుండెపోటుతో అకస్మికంగా మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్టమధు పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల నేతలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి జగన్‌నాయక్ మృతదేహానికి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన తూముల రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి భార్య కవితను మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004-05 పదవ తరగతి బ్యాచ్ బాల్య మిత్రులు పరామర్శించారు. అనంతరం ఆమెకు రూ.30వేల చెక్కును ఆర్థిక సాయంగా అందించి భరోసా కల్పించారు. ఇద్దరు కూతుర్లతో దీన స్థితిలో ఉన్న ఆమెకు నిరంతరం అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు. పరామర్శించిన వారిలో వైనాల మహేందర్, ముష్కు రాజ్‌కుమార్, అచ్చ మహేందర్, చిక్కుల ప్రమోద్, మ్యాదరి రాజేందర్, పావుశెట్టి అశోక్, అచ్చ రాజయ్య, తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత



టేకుమట్ల: మండలంలోని సోమనపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన జీడ చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని సర్పంచ్ ఉద్దమారి మహేష్‌యాదవ్ సోమవారం పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ రాం ఉమాదేవేందర్, వార్డు సభ్యులు భిక్షపతి, స్వరూప, ఓదెలు, రామస్వామి, ఈశ్వర్, రాజకొమురు ఉన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు కరువు

- జాతరకు పెరుగుతున్న భక్తుల రద్దీ
- మహిళలకు తప్పని తిప్పలు



తలుపులు సరిగా లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి : జాతరలో దేవాదాయ శాఖ సేవలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కాని సొంత కార్యాలయం ఆవరణలోనే మరుగుదొడ్లకు మరమ్మతులు కరువయ్యాయి. జాతరకు భక్తుల రద్దీ తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. గద్దెల ప్రాంతం, ఎండోమెంట్ కార్యాలయం ఆవరణ, పోలీస్ క్యాంప్ ఆఫీసు ప్రాంతాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మహిళలకు ఎక్కడా మరుగుదొడ్లు కనిపించకపోవడంతో కనీసం ఉన్నఫలంగా కార్యాలయంలో ఉన్న మరుగుదొడ్లను కూడా ఇప్పటి వరకు మరమ్మతులు చేయకపోవడం, అవి వినియోగంలోకి రావడం లేదు. మరమ్మతులు చేపడితే మహిళా భక్తులకు అత్యవసర సమయాల్లో అందుబాటులోకి వచ్చేయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపడుతున్న అధికారులు మరగుదొడ్ల మరమ్మతులు ఎందుకు చేపట్టడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. భక్తులకే కాకుండా జాతర సందర్భంగా విధులు నిర్వర్తించే పోలీసులు, మీడియా ప్రతినిధులు నిత్యం ఎండోమెంట్ కార్యాలయం ప్రతినిధులు విధులు నిర్వర్తిస్తుంటారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి అందరికీ వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉంది. కేవలం రంగులతో సరిపెట్టినా తలుపులు, బేసిన్‌లు అపరిశుభ్రంగా ఉండటంతో అవి ఎందుకు పనిరాకుండా ఉన్నాయి.

కొబ్బరినీళ్లతో అపరిశుభ్రత

సమ్మక్క గద్దె వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు స్టాండ్ ఏర్పాటు చేశారు. గద్దె పక్కనే స్టాండ్ ఏర్పాటు చేయడంతో దర్శనానికి వచ్చిన వందలాది మంది భక్తులు స్టాండ్ వద్ద కొబ్బరికాయలు కొట్టడంతో కొబ్బరినీళ్లు కింద పడి గద్దెల చుట్టూ చేరి భక్తుల కాళ్లకు అతుక్కపోతుంది. దేవాదాయ శాఖ సిబ్బంది గద్దెలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నప్పటికీ గద్దె పక్కనే స్టాండ్‌లో కొబ్బరికాయలు కొట్టడంతో అపరిశుభ్రత ఏర్పడుతుంది. గద్దె సమీపం నుంచి ఈ స్టాండ్‌ను తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



గద్దె పక్కనే ఉన్న కొబ్బరికాయలు కొట్టే స్టాండ్

బాధిత కుటుంబాలకు పోలీసుల చేయూత



ములుగు : మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సీఐ రంజిత్, ఎస్సై వెంటేశ్వర్లు



ఎస్ఎస్ తాడ్వాయి : మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ములుగు/ములుగు రూరల్ : గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు జెండాను ఎగురవేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన బోడ అంజిత్‌కుమార్, ల్యాడ విజయ్ కుటుంబాలకు పోలీసులు అండగా నిలిచారు. స్పందించిన సీఐ మేకల రంజిత్ కుమార్, ఎస్సై అప్పని వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాలకు రూ. 3500తో పాటు ఇరు కుటుంబాలకు 25 కేజీల బియ్యం చొప్పున అందించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రవీణ్, సృజన్, మహేష్, శ్రీకాంత్, జంగయ్య, శ్రవణ్, పూర్ణ, రాకేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన ఉపసర్పంచ్ ఆలేటి ఇంద్రాసేనారెడ్డి తల్లి మణెమ్మ (67) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. సోమవారం మృతురాలి కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సాంబయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ ల్లయ్య, పీఏసీఎస్ వైస్ చై ర్మన్ లాలయ్య, పత్తిగోపాల్‌రెడ్డి పరామర్శించారు.

నిరంకుశ పాలన వీడాలి



వాజేడు : మాట్లాడుతున్న గణేష్



వెంకటాపురం(కె) : మాట్లాడుతున్న సాయి

వాజేడు: గిరిజన సమాజంపై నిరంకుశ పాలన విడనాడాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు రేగ గణేష్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గోండ్వానా సంక్షేమ పరిషత్ అత్యవసర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆదివాసీ సమాజంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ పాలన వీడాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గిరిజనుల బతుకులు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. చెమటోడ్చి పోడు నరికితే వాటికి హక్కుపత్రాలను కూడా ఇవ్వకుండా తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ధరణి పోర్టల్ వ్యవస్థ మూలంగా ఏజెన్సీలో గిరిజనేతరులు అక్రమంగా వలస వచ్చి ప్రభుత్వ భూములను కబ్జా చేసి పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3న భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయడానికి ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మోహన్, ప్రతాప్, వెంకటకృష్ణ, రమేష్, అనిల్, చంటి, రాజబాబు పాల్గొన్నారు.

మన్విత్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

వెంకటాపురం(కె): పాలెం ప్రాజెక్టు కెనాల్‌లో పడి మృతి చెందిన ఓంటిమామిడి గ్రామానికి చెందిన మన్విత్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. సోమవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్విత్ మృతికి కారణమైన పాలెం ప్రాజెక్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓంటిమామిడి ఆదివాసీలు కాల్వల దాటేందుకు కాల్వపై బ్రిడ్జి కట్టించాలని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రాజెక్టు కెనాల్‌పై బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకృష్ణ, మట్టి రమేశ్ తదితరులు ఉన్నారు.

సబ్‌సెంటర్ పరిశీలన



మల్హర్: మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని సబ్ సెంటర్‌ను ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లో మౌలిక వసతులపై ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి



కాళేశ్వరం: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ప్రజాప్రతినిధులు అన్నారు. మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని జెడ్పీటీసీ గుడాల అరుణ, అన్నారం సర్పంచ్ కోరాల సునీతసురేందర్, ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల కోసం అభివృద్ధి కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశాడాని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిట్టూరి సుజాతరాకేష్, డీసీసీ ప్రధానకార్యదర్శి కామిడి శ్రీనివాసరెడ్డి, దళిత సంఘాల నాయకులు, పంచాయతీ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

బెల్లంషాపులు మాకే కేటాయించాలి

- అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన భోజారావు



మాట్లాడుతున్న భోజారావు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం జాతరలో ఆది వాసీలకు కేటాయించే కొబ్బరి, బెల్లం, లిక్కర్ దుకాణాలను ఆదివాసీ అభ్యుదయ సంఘానికే కేటాయించాలని అ సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన భోజారావు డిమాండ్ చేశారు. సోమవారం మేడారంలోని ఐటీడీఏ కార్యాలయంలోని ఆవరణలో పూజారులు, స్థానిక ఆదివాసీ యువతతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతేడాది వర్షాలు, వరదలకు స్థానిక ఆదివాసీలు, పూజారుల కుటుంబాల యువకులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం కూడా అందలేదన్నారు. విపత్కర సమయంలో ఆదివాసీ సంఘాలు జాతిపరంగా ఎలాంటి సహాయ, సహకారాలు అందించలేదన్నారు. జాతర సమయంలో వీరు వచ్చి కొబ్బరి, బెల్లం, లిక్కర్ షాపులు ఇవ్వమనడం సమంజసం కాదన్నారు. జాతర సమయంలో పూజా కార్యక్రమాల్లో అభ్యుదయ ఆదివాసీ యువతే సహకరించడం జరుగుతుందన్నారు. తాము ఆర్థికంగా నష్టపోయామని, ఈ మహాజాతరలో బెల్లం, కొబ్బరి, లిక్కర్ షాపులకు మాకే కేటాయించాలని ఐటీడీఏ పీఓ అంకిత్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పూజారులు, అభ్యుదయ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు



బాలకార్మికులతో అధికారులు

కన్నాయిగూడెం: మైనర్ బాలబాలికలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నరేష్ అన్నారు. సోమవారం మండలంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని ఏటూరు గ్రామంలో మిర్చితోటలో పని చేస్తున్న 14 ఏళ్లలోపు బాలకార్మికులను 15 మంది బాలికలు, 11 మంది బాలురను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు.కార్యక్రమంలో విక్రమ్, రాణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



సన్మానం పొందిన విద్యార్థులు, పీడీ

ఏటూరునాగారం: గురుకులంలోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం అన్నారు. ఇటీవల తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయిలో ఖేల్ ఇండియాలో భాగంగా కళాశాల విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చారన్నారు. ఈ మేరకు సోమవారం కళాశాల ఆవరణలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు, జాతీయస్థాయిలో 7 అవార్డులు పొందిన పీడీ రమణను లెక్చరర్లు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడానికి తమవంతు ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జోసెఫ్ జైన్, లెక్చరర్లు శ్రీలత, రాజ్యం, జైపాల్, వీరన్న, మోతీలాల్, మోహన్, నర్సయ్య, సదానందం, రామ్మూర్తి, శ్రీలత, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

మహాముత్తారం: గ్రామస్తులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎస్సై దాసరి సుధాకర్ సూచించారు. మండలంలోని కొర్లకుంట గ్రామంలో అడవి ముత్తారం ఎస్సై సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్, ధ్రువీకరణ పత్రాలు సరిగా లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడుంబా, గుట్కా, గేమింగ్ వంటి చెడు వ్యసానాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న రజినీకాంత్

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలను అందజేయాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు చింతల రజినీకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం 10 ఏండ్లలో అర్హులకు రేషన్ కార్డులు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయలేదని అన్నారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు అందజేసి జీఓ నంబర్ 59 ప్రకారం పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సీమంతం చేస్తున్న ఎంపీపీ దావు వినోద

చిట్యాల: గర్భిణులు, బాలింతలు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి అన్నారు. సోమవారం చల్లగరిగె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం ఎంపీపీ వినోద మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా బాలింతలు, గర్భిణులు తీసుకోవాలని కోరారు. ప్రతి రోజు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తెలిపారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు త్రివేణి, తిరుపతమ్మ, కవిత, కనకలక్ష్మీ, శారద, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణా అరికట్టాలి

భూపాలపల్లి రూరల్: మానవ, బాలల అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్సై సంధ్య పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ప్రసన్న అధ్యక్షతన బాలబాలికలకు ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ, మై ఛాయిస్ ఫౌండేషన్, ఎహెచ్‌టీయూ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యక్రమం, మానవ, బాలల అక్రమ రవాణా నిర్మూలన అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై సంధ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటస్వామి మాట్లాడారు. బాలల రక్షణకు గ్రామంలోని ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా యువజన సంఘాలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. సీసీఎస్ ఎస్సై భాస్కర్ మాట్లాడుతూ బాలల చట్టాల గురించి, ఆపద సమయంలో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నంబర్లు పోలీస్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సైబర్ నేరాలు 1930, గృహ హింస 181, నేషనల్ యాంటీ సెక్స్ ట్రాఫికింగ్ హెల్ప్ లైన్ 18004198588ల గురించి వి వరించారు. అనంతరం సురక్షిత గ్రామ కార్యక్రమం బుక్‌లెట్స్ విడుదల చేశారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజలకు పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కాటారం : గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సమ్మయ్య



మల్హర్ : భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కాటారం: గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తుందని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండలంలోని వీరాపూర్ గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని సర్పంచ్ రమేశ్‌రెడ్డితో కలిసి ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సమాగ్రభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యం, రవాణా, తాగునీరు, సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల సేవలను విస్తృత పర్చేలా అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సర్పంచ్ వేమునూరి రమేశ్‌రెడ్డిని అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, సీడీపీఓ రాధిక, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహేశ్ రవీందర్ రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తెప్పల దేవేందర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల, అడ్వాలపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, జెడ్పీటీసీ అయిత కొమల రాజిరెడ్డి సోమవారం ప్రారంభించారు. సర్పంచ్‌లు సత్తయ్య, రాజునాయక్, పీఏసీఎస్ చైర్మన్ రామరావు, ఉర్పంచ్ చంద్రయ్య, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో నూతన ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఫర్టిలైజర్-పెస్టిసైడ్-సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఏలేటి ప్రభురెడ్డి, ఉపాధ్యక్షులుగా పేర్వాల శ్రీనివాస్, లాండే శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి తిరుపతి, కోశాధికారిగా జీవన్, ప్రచార కార్యదర్శిగా దార్ల శివాజీలను ఎన్నుకున్నారు.